

ఎల్లమ్మబండ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు శివరాజ్‌గౌడ్, భాస్కర్, షౌకత్ అలీమున్నా, బాలస్వామి



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, ఏలూరు సత్తెన్న, శ్రీనివాస్, కృష్ణంరాజు



గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సాంటిరెడ్డి పున్నారెడ్డి, తదితరులు

రైతు రుణమాఫీపై హర్షం

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రైతు డిక్లరేషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసింది. ఇది దేశ చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పలుచోట్ల బాణ సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు.

- మియాపూర్/హైదర్‌నగర్/నిజాంపేట్/గాజులరామారం/పేట్‌బషీరాబాద్/బాలానగర్



గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, రోహిణ్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కొంపల్లి పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, నాయకులు జిమ్మి దేవేందర్, గోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నరేందర్



నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ హమీద్‌పటేల్, తదితరులు



దండు సాయికిరణ్, అతడి అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కాంగ్రెస్‌లో చేరిక

గాజులరామారం/బాలానగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ క్షణం ప్రజల సంక్షేమం కోసమే ఆలోచిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, రంగారావు, రషీద్‌బేగ్, వెంకట్, దుర్గారావు పాల్గొన్నారు. బాలాజీనగర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో దండు సాయికిరణ్, రాయపాటి వెంకటేశ్, అజయ్, కృష్ణ, సురేశ్, అమర్, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

బాలానగర్ ఫ్లైఓవర్ జీహెచ్‌ఎంసీ చేతికి

- పూర్తి నిర్వహణ బాధ్యతలు అప్పగించిన హెచ్‌ఎండీఏ

హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఫ్లైఓవర్‌ను హెచ్‌ఎండీఏ అధికారులు జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. ఇక ముందు పూర్తి నిర్వహణ బాధ్యతలన్నీ జీహెచ్‌ఎంసీయే చేపట్టనుంది. బాలానగర్ ఫ్లైఓవర్ పైగల వీధిదీపాలు, స్వీపింగ్, కింది భాగంలోని గార్డెనింగ్, ఫుట్‌పాత్‌లు, రోడ్ల నిర్వహణ పూర్తిగా జీహెచ్‌ఎంసీ నిర్వహించనుంది. బాలానగర్‌లోని నర్సాపూర్ ఎక్స్‌రోడ్డులో 1.13 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్‌ను రెండేళ్ల క్రితం హెచ్‌ఎండీఏ నిర్మాణం చేసింది. 44వ జాతీయ రహదారికి, 65వ జాతీయ రహదారికి అనుసంధానమైన ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య తీరింది. బాలానగర్ ఫ్లైఓవర్ అంచనా వ్యయం రూ.387 కోట్లు కాగా, భూసేకరణ కుదించడం వల్ల దాదాపు రూ.300 కోట్లతోనే పూర్తయ్యింది. 2021 జూలై 6న మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో శివమ్మ అనే పారిశుధ్య కార్మికురాలు ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్మాణం చేసిన హెచ్‌ఎండీఏనే నిర్వహణ బాధ్యతలను చూసింది. ఫ్లైఓవర్ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌కు ఉండే డిఫెక్ట్ లియబిలిటీ పిరియడ్(డీఏలపీ) రెండేళ్ల గడువు కూడా తీరింది. దాంతో బాలానగర్ ఫ్లైఓవర్‌ను హెచ్‌ఎండీఏ అధికారులు జీహెచ్‌ఎంసీకి అప్పగించారు.



బాలానగర్ ఫ్లైఓవర్

రేపు గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్ ప్రారంభం

రాయదుర్గం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లితండా చౌరస్తా వద్ద ఫ్లైఓవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 20న ప్రారంభిస్తారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం ఆయన ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సీతారమయ్య, ఏఈ అజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీసీ స్ట్రీట్ లైట్స్ మల్లికార్జున్, ఏఎంహెచ్‌ఓ నగేష్‌నాయక్, ఎస్‌ఆర్‌పీ భరత్, నాయకులు గణేశ్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, రాజునాయక్, అనిల్, మల్లేష్, వినోద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

మియాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, దామోదర్‌రెడ్డి, నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, రాఘవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చందునాయక్, రేణుక, కృష్ణారావు, సంపత్‌రెడ్డి, కట్ట శ్రీనివాస్, కృష్ణగౌడ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

రెండు నెలల్లో పార్థివ్‌వాడ పాఠశాల భవనం పూర్తి

- కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అర్ధాంతరంగా ఆగిన ఫతేనగర్ డివిజన్ పార్థివ్‌వాడ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ హెచ్‌ఎం అనిల్, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. గురువారం ఏఈ పవన్‌తో కలిసి పాఠశాల భవనం పనులను పరిశీలించారు. కమ్యూనిటీహాల్లో కొనసాగుతున్న పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గణేశ్, జయమ్మ, సురేందర్ పాల్గొన్నారు.

కొంపల్లి అభివృద్ధికి కృషి

పేట్‌బషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం ఆయన కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు శ్రీ విద్యాప్రశాంత్‌గౌడ్, వసంతాలక్ష్మణ్‌గౌడ్, రజనీజీవన్‌రెడ్డి, కృష్ణవేణి వినోద్, రవీందర్, డప్పు కిరణ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన శ్రీశైలంయాదవ్

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం

పేట్‌బషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.హరిబాబు, ఉపాధ్యక్షుడిగా పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా కావలి నవీన్, జాయింట్ సెక్రటరీగా విశాల్, ట్రెజరర్‌గా రాజశేఖర్, సలహాదారులుగా కె.గోపాల్, ఎ.ఆంజనేయులు, భాగ్య, గోపాలకృష్ణ, అశోక్, గిరిబాబు, రవీందర్, కృష్ణ, శంకర్, లక్ష్మణ్, సత్తన్న, సాయిబాబులను ఎన్నుకున్నారు. వీరంతా కలిసి కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్‌ను ఆయన నివాసంలో సన్మానించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణరాజు

జీడిమెట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చెల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జి.సత్యనారాయణరాజును నియమిస్తూ పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి గురువారం ఉత్తర్వు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణరాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

రూ.100 కోట్ల ప్రభుత్వ స్థలానికి మోక్షం

- పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- ఫలించిన సహేలీ పోరాటం
- మిథులానగర్ ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు

18 సంవత్సరాల సహేలీ పోరాటం ఫలించింది. వంద కోట్ల ప్రభుత్వ స్థలం పరిరక్షణకు ఈవీడీఎం కమిషనర్ చర్యలు తీసుకున్నారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వంద కోట్ల రూపాయల విలువ చేసే పార్కు స్థలాన్ని ఇప్పటికే కొంతమంది ఆక్రమించారు. మిగతా స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎవరికి వారు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆ స్థలంలో పార్కు, కమ్యూనిటీహాల్ నిర్మించాలని కాలనీ మహిళలు 18 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారు. స్థల పరిరక్షణ కోసం సహేలీ అనే గ్రూపును కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఇలా కనపడిన ప్రతి ఒక్కరికీ వినతిపత్రం ఇచ్చారు. ఏ ఒక్కరూ స్పందించలేదు. కబ్జాదారుల వైపే మొగ్గు చూపించారు. జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్‌కు ఈ స్థలం గురించి తెలిసింది. స్వయంగా ఆయనే రంగంలోకి దిగి ఇటీవలే ఆక్రమణలను కూల్చివేశారు.



ఆక్రమణలు కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు

మూడు ఆక్రమణలు

సహేలీ ఓ వైపు పోరాటం చేస్తుండగా మరోవైపు కబ్జాదారుల కన్ను ఈ స్థలంపై పడింది. కాలనీకి ఆనుకొని ఉన్న సయ్యద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి 250 గజాల స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టాడు. కాలనీకి చెందిన ప్లాట్‌నంబర్ 55, 56 యజమానులు 350 గజాల చొప్పున స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. ఈ ప్లాట్లకు నకిలీనంబర్‌లను కూడా సృష్టించారు. మిగతా స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు ఎవరికి వారు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే విషయాన్ని సహేలీ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు పట్టించుకోకుండా కబ్జాదారులకే వత్తాసు పలికారు. తాజాగా జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్‌కు స్థలం గురించి తెలిసింది. సహేలి ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించారు. విచారించగా స్థలం జీహెచ్‌ఎంసీ పార్కుల విభాగంలోనే ఉన్నట్టు తేలింది. రెండు రోజుల క్రితం ఆయన మిథులానగర్‌కు చేరుకున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులను, సిబ్బందిని రంగంలోకి దింపి ఆక్రమణలను కూల్చివేయించారు. చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. బయోడైవర్సిటీ అధికారులను పిలిచి పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ప్లాట్‌నంబర్ 55, 56 యజమానులు ఆక్రమించిన స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఇదంతా కొన్ని గంటల్లోనే పూర్తి చేశారు. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ స్పందించడంతో కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారులు మరింత రెచ్చిపోకముందే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇదీ అసలు కథ..

బంజారాహిల్స్ రోడ్డునంబర్.12 మిథులానగర్ కాలనీలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు అధికంగా నివసిస్తుంటారు. కాలనీ మధ్యలో 5,060 గజాల లే అవుట్ స్థలాన్ని వదిలేశారు. కమ్యూనిటీ పరంగా దీనిని ఉపయోగించుకోవాలని కాలనీవాసులు భావించారు. ఆ స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అంగీకరించారు. జీహెచ్‌ఎంసీ రికార్డుల్లో కూడా పార్కు కోసం స్థలం కేటాయించినట్టు నమోదు చేశారు. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించలేదు. స్థలంలో ఎలాగైనా పార్కు, కమ్యూనిటీహాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని కాలనీ మహిళలంతా కలిసి సహేలీ అని సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా 2006 నుంచి పార్కు కోసం పోరాటం మొదలు పెట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

కుమార్తెపై తండ్రి అత్యాచారం

- నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

పీర్జాదిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసినట్లు ఓ కీచక తండ్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న కన్న కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం మేడిపల్లిలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో తనపై తండ్రి పాల్పడ్డ ఘోరాన్ని 12 ఏళ్ల ఆ బాలిక పక్కింటి మహిళకు చెప్పుకుంది. బాలిక చదువు కోసం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటుండగా భర్తతో గొడవపడ్డ ఆమె తల్లి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెని తండ్రి రెండు రోజుల క్రితమే ఇంటికి తీసుకొచ్చాడు. ఒంటరిగా ఉన్న కుమార్తెపై బుధవారం అత్యాచారానికి ఒడిగట్టాడు. ఏం చేయాలో పాలుపోని ఆ బాలిక తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగానే పక్కింటి మహిళకు చెప్పింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని నిర్ధారించుకున్నాక పోలీసులు తండ్రిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

ఎమ్మెల్యేకు ఆశావర్కర్ల వినతి

హైదర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను శుభ్రం చేసే విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన జోన్ పరిధిలోని చెరువులు, రోడ్లను పరిశీలించారు. చెరువుల్లో గుర్రపుడెక్క లేకుండా చూడాలని, మురుగునీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొత్తగూడ కూడళ్లు, మసీద్‌బండ, కొండాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, రహదారులను పరిశీలించారు. ఆయన వెంట డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ నగేష్, యూబీడీ మేనేజర్ విక్రమ్, అధికారులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం జయరాజును సన్మానిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

హైదర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధి రిక్షాపుల్లర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాజు, ఉపాధ్యాయులు విజయకుమారి, సునీత, ముకుందారెడ్డి, పీఎస్ సబిత, ఎంఎన్ సృజన బదిలీపై వెళ్తున్నారు. వీరిని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా రోజాదేవి మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు 11 సంవత్సరాలుగా పాఠశాల యాజమాన్య కమిటీతో కలిసి పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్చక బదిలీలను నిలిపేయాలి

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో అధికారులు, సిబ్బందితోపాటు అర్చకుల బదిలీలకు జరుగుతున్న ప్రయత్నాన్ని నిలిపేయాలని భాగ్యనగర అర్చక పరిషత్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. దైవాన్ని నమ్ముకుని దశాబ్దాలుగా ఒకేచోట పనిచేస్తున్న అర్చకులను బదిలీల పేరుతో మరో ప్రాంతానికి మార్చడం సరైంది కాదన్నారు. బదిలీలు నిలిపేయడంతోపాటు వారికి పెన్షన్ ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అర్చకుల బదిలీ నిలిపివేత అంశంపై త్వరలోనే సీఎం, మంత్రితోపాటు అధికారులను కలిసి విన్నవించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు భాస్కరబట్ల రామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

గాజులరామారం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు గురువారం కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ సర్వేనంబర్ 342, 100, 13ల్లోని కైసర్‌నగర్, గాజులరామారం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో వెలిసిన నిర్మాణాలను ఆర్ఐ రజనీకాంత్ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇండోర్ క్రికెట్ స్టేడియం సీజ్

షాపూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వేమారెడ్డినగర్‌లో ఇండోర్ క్రికెట్ స్టేడియం, టీ కొట్టును మున్సిపల్ అధికారులు గురువారం సీజ్ చేశారు. డీసీ మల్లారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది తాళం వేశారు. స్టేడియంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడం వల్లే చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అల్లాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ భీమవరం మండలం దిరుసుమర్రుకు చెందిన గంట్యాడ రమేష్(38) అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్‌నగర్‌లో ఉంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏసీ రిపేరు పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల బుధవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. డ్యూటీ నుంచి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొమురంభీం విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్-1, 2లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు గౌలిదొడ్డి ఫీడర్ పరిధిలోని జర్నలిస్టు కాలనీ, గౌలిదొడ్డి, పద్మశ్రీగార్డెన్స్‌లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.